క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' కార్యాలయం ప్రారంభం

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయం పక్కన వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఎన్నికల కార్యాలయం గురువారం ప్రారంభించనున్నారు. ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు, పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి హాజరవుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

చిరస్మరణీయుడు 'కొసనా'

సీతంపేట: సాంస్కృతిక రంగ నిఘంటువు కొసనా అని ఆత్రేయ స్మారక కళా పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళి అన్నారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కళా సేవకుడు కొమ్మోజు సత్యనారాయణ(కొసనా) 4వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న కళాకారులను ప్రోత్సహించిన కొసనా చిరస్మరణీయుడని కొనియాడారు. కొసనా తనయుడు బ్రహ్మాజీ మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం, గానం, నృత్యం, నాటక రంగాల అభివృద్ధికి కొసనా ఎంతో కృషి చేశారన్నారు. ముందుగా కొసనా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళా సంస్థల ప్రతినిధులు లతారాములు, చెన్నా తిరుమల రావు, నరవ ప్రకాశరావు, ఎం.వి.రాజశేఖర్, ఎ.ఎం.ప్రసాద్, టి.ఎల్.ప్రసాద్, కోరుకొండ రంగారావు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌కు 880 మంది హాజరు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో బుధవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాలకు 880 మంది హాజరైనట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మేధా సర్వో డ్రైవ్స్ మల్టీనేషనల్ కంపెనీ ఏర్పాటు చేసిన క్యాంపస్ డ్రైవ్‌లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ విభాగాల ఫైనలియర్ విద్యార్థులు 800 మంది హాజరై రాత పరీక్ష రాయగా, టాటా హిటాచీ కంపెనీ నిర్వహించిన డ్రైవ్‌లో 80 మంది మెకానికల్ విద్యార్థులు రాత పరీక్ష రాసారని చెప్పారు. గురువారం కూడా క్యాంపస్ ఇంటర్వ్యూలు కొనసాగుతాయని రాత ఫలితాల అనంతరం మౌఖిక పరీక్ష ఉంటుందన్నారు. ఈ రెండింటిలో మంచి మార్కులు సాధించిన వారు ఆకర్షణీయమైన వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు పొందుతారని చెప్పారు.

3 నుంచి మహిళలకు వేసవి శిక్షణ తరగతులు

మురళీనగర్: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 3 నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్ పేస్ట్రీ షాపు సమీపంలోని భవనంలో కె.సుగుణ ఆధ్వర్యంలో మహిళలకు జ్యూట్ బ్యాగ్స్ స్టిచింగ్‌పై పది రోజుల పాటు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల వారు 90320 94771 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

సీతమ్మధార రైతుబజార్‌లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న అధికారి రామారావు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో బుధవారం తూనికలు, కొలతలు శాఖ అధికారులు తనిఖీలు చేశారు. తనిఖీ అధికారి రామారావు కాటాలను పరిశీలించారు. సీల్ లేకపోవడంతో ఐదుగురు రైతులకు సంబంధించిన కాటాలకు జారిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాటాలకు సీల్ వేయించుకోవాలని, లేనిపక్షంలో ఫైన్ వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తులకు తోడు

రాష్ట్ర ప్రభుత్వం చేతివృత్తిదారులకు చేయూత అందిస్తోంది. చేతివృత్తికారుల బతుకుల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. సరికొత్త సంక్షేమ పథకాలపై దృష్టి సారించారు. అందులో భాగంగా జగనన్న చేదోడు పథకానికి రూపకల్పన చేశారు. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టినా ఇచ్చిన మాట ప్రకారం రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు ఏడాదికి రూ.10 వేలు సాయం చేయడానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సర్వేలు చేసి పారదర్శకంగా లబ్ధిదారులను గుర్తించారు.

- టైలర్లు, నాయీ బ్రాహ్మణులు, రజకులకు ఆర్థిక ప్రోత్సాహం
- జగనన్న చేదోడు పథకం ద్వారా ఏటా రూ.10 వేల సాయం
- 51వ వార్డులో 164 మందికి లబ్ధి

మద్రిపాలెం: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేసింది. నవరత్నాలు పేరిట సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదలకు అండగా నిలిచింది. జగనన్న చేదోడు పథకంలో భాగంగా దర్జీలు, రజకులు, నాయీ బ్రాహ్మణులకు ఏటా రూ.10 వేలు చొప్పున సాయం అందిస్తోంది. ఈ క్రమంలో బతుకుతెరువు కోసం కుల వృత్తులు చేసుకుని కష్టపడే వారందరికీ ఆర్థికంగా భరోసానిచ్చింది. ఇప్పటి వరకు నేరుగా లబ్ధిదారులకు నాలుగు సార్లు వారి ఖాతాల్లోకి నగదు జమచేసింది.

లబ్ధిదారుల్లో ఆనందం

జీవీఎంసీ 51వ వార్డులో మొత్తం 164 మంది లబ్ధిదారులకు ఈ నాలుగేళ్లలో రూ.37.60 లక్షల నగదు లబ్ధి పొందారు. ఈ వార్డులో ఆరు సచివాలయాలు ఉన్నాయి. 286 వుడా కాలనీ, 287 అంబేడ్కర్ కాలనీ, 288 మహత్ కాలనీ, 289 కళింగనగర్, 290 గాంధీనగర్, 291 కళింగనగర్ సచివాలయాల పరిధిలో నివసిస్తున్న లబ్ధిదారులకు చేదోడు పథకం కింద ఏటా రూ.10 వేల చొప్పున నాలుగు సార్లు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి వారికి బతుకు తెరువుకు తోడైంది. తమ అర్హతలు గుర్తించి జగనన్న ప్రభుత్వం చేదోడు సాయం అందించడంతో చేతివృత్తులు సాఫీగా కొనసాగుతున్నాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



51వ వార్డులో 'జగనన్న చేదోడు' లబ్ధిదారుల వివరాలు

సచివాలయం	లబ్ధిదారులు	లబ్ధి(నగదు)
286	10	రూ.2.70 లక్షలు
287	29	రూ.7.50 లక్షలు
288	41	రూ. 9.20 లక్షలు
289	39	రూ.8 లక్షలు
290	21	రూ.5 లక్షలు
291	24	రూ.5.20 లక్షలు
మొత్తం	164	రూ.37.60 లక్షలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు మేలు



15 ఏళ్ల నుంచి టైలరింగ్, డ్రైవాష్ షాపు నడుపుతున్నాను. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక వరుసగా నాకు రెండేళ్లు చేదోడు పథకం లబ్ధి అందింది. వయసు మీద పడటం వల్ల ఆరోగ్యం బాగోలేక, టైలరింగ్ చేయలేక ఆపేశాను. ప్రస్తుతం డ్రైవాష్ ఒక్కటే చేస్తున్నాను. నా భార్యకు కాపునేస్తం పథకం అందుతోంది. నా ఇద్దరు కుమార్తెలకు వైఎస్సార్ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ వస్తే పిల్లల భవిష్యత్తు బాగుంటుంది.

– పి.వెంకటసత్య హరినాథ్, మాధవధార, 51వ వార్డు

నాలుగేళ్లుగా 'చేదోడు' అందుతోంది



మా సొంతూరు నర్సీపట్నం దగ్గర జి.కోడూరు. బతుకుతెరువు కోసం 23 ఏళ్ల కిందట ఇక్కడికి వచ్చాం. కులవృత్తి దుస్తులు ఉతుకుతూ, ఇస్త్రీ చేసుకుంటూ జీవిస్తున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గడిచిన నాలుగేళ్లలో ఏటా రూ.10 వేల చొప్పున రూ.40 వేలు జగనన్న చేదోడు పథకం లబ్ధి అందింది. దీంతో కొంత ఆర్థిక భరోసా కలిగింది. జగనన్న ప్రభుత్వంలో పేదలకు సంక్షేమ పథకాలు అందడం వల్ల మేలు జరుగుతోంది.

– కె.చిట్టిబాబు, అంబేడ్కర్ కాలనీ, 51వ వార్డు

సీఎం ఆర్థిక భరోసా కల్పించారు



గత 30 ఏళ్లుగా సెలూన్ షాప్ నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాను. నాలుగేళ్లుగా అందుతున్న జగనన్న చేదోడు ఆర్థిక సాయంతో సెలూన్ షాప్‌ను బాగుచేసి ఆధునికంగా మార్చుకున్నాను. ప్రస్తుతం షాపు సాఫీగా నడుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ఆర్థిక భరోసా కల్పించింది. మా బాబు 9వ తరగతి చదువుతున్నాడు. అమ్మ ఒడి పథకం అందుతోంది.

– పి.శ్రీను, రాజీవ్‌నగర్, 51వ వార్డు

కె.కె.రాజుకు సామాజిక సంఘాల మద్దతు



పాలుగొలుపు ఉత్సవానికి కె.కె.రాజును ఆహ్వానిస్తున్న సామాజిక సంఘాల నాయకులు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును పలు సామాజిక సంఘాల నాయకులు బుధవారం పార్టీ కార్యాలయంలో కలిసి మద్దతు తెలిపారు. సీతంపేటలో జరగనున్న పాలుగొలుపు మహోత్సవానికి తరలిరావాలని ఆయనను ఆహ్వానించారు. ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ తో గెలిపిస్తామని హామీ ఇచ్చారు. పలు సంఘా ల నాయకులు పాల్గొన్నారు.

పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు



అనుబంధ సంఘాల నాయకులకు స్వీట్లు తినిపిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతమ్మధార: పనిచేసే వారికి పార్టీలో తప్పక గుర్తింపు ఉంటుందని, సమష్టి కృషితో ఎన్నికల్లో విజయం సాధిద్దామని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు ఉత్తర నియోజకవర్గంలో పలు వార్డుల్లో నియమించిన అనుబంధ సంఘాల నాయకులు బుధవారం కె.కె.రాజు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయకులకు పరామర్శ



కాయల రామారావుతో మాట్లాడుతున్న కె.కె.రాజు



జీరు శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తున్న కె.కె.రాజు

సీతంపేట: ఇటీవల అనారోగ్యానికి గురైన 44వ వార్డు నాయకుడు కాయల రామారావు, ప్రమాదవశాత్తు గాయపడిన 55వ వార్డు నాయకుడు జీరు శ్రీనివాసరెడ్డిలను బుధవారం వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని, వారికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, 55వ వార్డు కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళ, నాయకులు ఆళ్ల శివగణేష్, దుప్పలపూడి శ్రీనివాసరావు, కె.పి.రత్నాకర్, గంగామహేష్, ఆళ్ల గోపి, యడ్ల శ్రీనివాస్‌రెడ్డి, జుంజురు గోవింద్, జామి దాసు, దివాకర్ రెడ్డి, ఎం.డి.గౌస్ పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శించడం తగదు



మహహ్మద్ సాధిక్ వ్యాఖ్యలను ఖండిస్తున్న బర్కత్ అలీ

మద్రిపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై మహహ్మద్ సాధిక్ చేసిన వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామని ఉత్తరాంధ్ర జిల్లాల మైనారిటీ విభాగం రీజినల్ కో ఆర్డినేటర్, 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, పార్టీ రాష్ట్ర మైనారిటీ విభాగం కార్యదర్శి షేక్ బాబ్జి అన్నారు. వార్డు కార్యాలయంలో బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ జనసేన పార్టీ ఉత్తరాంధ్ర మైనారిటీ విభాగం కన్వీనర్, 39వ వార్డు కార్పొరేటర్ మహహ్మద్ సాధిక్ చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదన్నారు. ఇండిపెండెంట్ కార్పొరేటర్‌గా గెలిచి వైఎస్సార్‌సీపీలో చేరి, ముస్లిం మైనారిటీ కోటాలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్ పదవిని పొంది, తన స్వార్థం కోసం జనసేనలో చేరి ఇప్పుడు ప్రభుత్వాన్ని విమర్శించడం తగదని ఎద్దేవా చేశారు. ఇలా చేయడం సాధిక్ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తాను ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారని, వక్ఫ్‌బోర్డు భూముల టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆక్రమణలకు గురయ్యాయని, వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో ఆక్రమణలకు గురైన వాటిని స్వాధీనం చేసుకున్నారని గుర్తుచేశారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించి మైనారిటీల మనసుల్లో వైఎస్సార్ నిలిచారని, అదే బాటలో ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మైనారిటీలకు పెద్ద పీట వేసిందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో మా ప్రభుత్వానికి ఎవరూ సాటిలేరని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో మైనారిటీ కోటాలో ఏడుగురికి ఎమ్మెల్యే సీట్లు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్న చిన్నారులతో కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్, సిబ్బంది

తాటిచెట్లపాలెం: పోర్ట్ గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ ఎదురుగా గల కేంద్రీయ విద్యాలయం వాల్తేర్‌లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. బాలవాటిక పిల్లలకు ప్రిన్సిపాల్ కమల్‌జీత్ చేతుల మీదుగా రిపోర్ట్ కార్డులు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తును అందంగా, క్రమశిక్షణతో తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదన్నారు. ప్రస్తుత రోజుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలతో కాసేపు గడపడం, స్కూల్‌లో జరిగిన విషయాలపై చర్చించడం ఎంతో అవసరమని ప్రధానోపాధ్యాయిని వి.ఎం.శైలజ అన్నారు. 5వ తరగతి విద్యార్థులు కూడా ఇదే రోజు సెకండరీ స్కూల్‌లో అడుగుపెట్టారని, వీరు జాగ్రత్తగా మార్పులను గమనించి చదువులో ముందుకు సాగాలని వీరు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది వాణి, చంద్రకళ, విజయలక్ష్మి, భవాని, డాక్టర్ త్యాగరాజు, ఎం.రేఖ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే ప్రశాంతంగా ఎన్నికలు



ఫోర్త్‌టౌన్ హైవేపై కవాతు చేస్తున్న ఎస్‌ఐ వెంకటరావు, సీఐఎస్ఎఫ్ బలగాలు

సీతమ్మధార: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం పోలీసులు, కేంద్ర పోలీస్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. నగర పోలీస్ కమిషనర్ డా.రవిశంకర్ అయ్యనార్ ఆదేశాల మేరకు ఈస్ట్ ఏసీపీ మెహర్ జయరాం ప్రసాద్ నేతృత్వంలో సీఐ ఎస్.విజయకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటరావు, సివిల్ పోలీసులు, బలగాలు సంయుక్తంగా కవాతు చేపట్టారు. ఫోర్త్‌టౌన్ హైవే, అక్కయ్య పాలెం, నందగిరినగర్, ముస్లిం తాటిచెట్లపాలెం, తాటిచెట్లపాలెం, ఏఎస్సార్ నగర్, 80 ఫీట్ రోడ్డు ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ చేస్తూ స్థానిక ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ విజయకుమార్ మాట్లాడుతూ నగరానికి కేంద్ర ఎన్నికల సంఘం పంపిన సీఐఎస్ఎఫ్ బలగాలతో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించడమే కాకుండా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా తామున్నామని ఒక భరోసా కల్పించేందుకు కవాతు చేసినట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతయుతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని, అసాంఘిక శక్తులకు సహకరించవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు, అసాంఘిక చర్యలకు పాల్పడే వారి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. సీఐఎస్ఎఫ్ అధికారులు, ఫోర్త్‌టౌన్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

- బీజేపీ అభ్యర్థిని చిత్తుగా ఓడిస్తాం
- ఉత్తరాంధ్రుల ఆత్మాభిమానాన్ని కాపాడుతాం
- 'ఉత్తర' ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు



రిబ్బన్ కట్ చేసి పార్టీ 50వ వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కె.కె.రాజు తదితరులు

మద్రిపాలెం: రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజును చిత్తుగా ఓడిస్తామని, ఉత్తరాంధ్ర ప్రజల ఆత్మాభిమానాన్ని కాపాడతామని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 50వ వార్డు మాధవధార మెయిన్ రోడ్డులో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని బుధవారం ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో స్థానిక ప్రజలను సమన్వయ పరుస్తూ పార్టీ విజయానికి అందరూ తప్పకుండా కృషిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటి వరకు ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని, అది చూసి ఓర్వలేక టీడీపీ–బీజేపీ–జనసేన పార్టీలు తప్పుగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. విష్ణుకుమార్‌రాజుకు మతిభ్రమించి తమ పార్టీ నాయకులు, మహిళలపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ఆయనను చిత్తుచిత్తుగా ఓడించి తీరతామని శపథం చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయ బావుటా ఎగురవేయడం ఖాయమని, సీఎంగా మళ్లీ వైఎస్ జగన్‌కు సాదర స్వాగతం పలుకుతామన్నారు. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర నియోజవర్గ ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర రావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు చల్లా రజని ఈశ్వరరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సారిపిల్లి గోవింద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, కె.వి.ఎన్.శశికళ, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, విజయ్‌కుమార్, జేసీఎస్ మండల కన్వీనర్లు, పార్టీ శ్రేణులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న యువసేవ ఫౌండేషన్ ఫౌండర్ హరిప్రసాద్, జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: అనాథ మృత దేహానికి తాటిచెట్లపాలెం యువ సేవ ఫౌండేషన్ సభ్యు లు అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలిలా.. ఇటీవల పలాస స్టేషన్ పరిధి లో గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి జారి పడి, తీవ్ర గాయాలపాలయ్యాడు. ఇతడిని గవర్న మెంట్ రైల్వే పోలీసులు కేజీహెచ్‌లో చేర్పించారు. ఈ వ్యక్తి చికిత్స పొందుతూ రెండు రోజుల కిందట మరణించాడు. మృతుడి గురించి ఆరా తీసినప్పటికీ ఫలితం లేకపోవడంతో యువసేవ ఫౌండేషన్ ఫౌండర్ పీలా హరిప్రసాద్ తన సభ్యులతో ముందుకొచ్చి అంత్యక్రియలు జరిపించారు. కార్యక్రమంలో పలాస జీఆర్పీ కానిస్టేబుళ్లు సోమేశ్వరరావు, శశికుమార్ పాల్గొన్నారు.

అలరించిన కథా కచేరి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రభాకర్, విజయ్‌కుమార్

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కథా కచేరి కార్యక్రమం అలరించింది. పలువురు సాహితీ వేత్తలు తమ కథలను సభకు పరిచయం చేశారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కథల్లో జీవితం, వ్యక్తుల స్వభావం, ప్రాపంచిక సత్యాలు కనిపించాలన్నారు. కథ చదివిన పాఠకులకు తెలియని అనుభూతి కలగాలన్నారు. డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ రచయితలు సామాజిక స్పృహ ఉన్న రచనలు చేయాలని సూచించారు. అనంతరం జరిగిన కథా కచేరిలో రచయితలు ద్విభాష్యం రాజేశ్వరరావు, సాధనాల వెంకటస్వామి, భాఘవతుల సత్యనారాయణ మూర్తి, డాక్టర్ డి.వి.సూర్యారావు, కొత్తూరి రమణ, సిహెచ్. చినసూర్యనారాయణ, జె.పి.శర్మ, అయ్యల సోమయాజుల ప్రసాద్ తదితరులు స్ఫూర్తిదాయకమైన కథలు వినిపించారు.

ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఆర్‌వో హుస్సేన్ సాహెబ్

కంచరపాలెం: ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే చర్యలు తప్పవని పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్‌వో) హుస్సేన్ సాహెబ్ పేర్కొన్నారు. జ్ఞానాపురం జోన్–5 జోనల్ కార్యాలయంలో సమావేశం మందిరంలో బుధవారం సాయంత్రం రెవెన్యూ డివిజనల్ అధికారి నేతృత్వంలో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ వీఎస్‌టీ టీమ్ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీమ్ సభ్యులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఎన్నికల కమిషన్ సూచనల మేరకు పని చేయాలని సూచించారు. ఎన్నికల నియమావళిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఎస్వీటీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు నియోజకవర్గంలో పర్యటిస్తూ నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డీటీ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ కళాశాలను సందర్శించిన అధ్యాపక బృందం



సెయింట్ జోసెఫ్ కాలేజీ ప్రిన్సిపాల్ షైజీతో మైసూర్ సీఐఐఎల్ బృంద సభ్యులు

కంచరపాలెం: మైసూర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్(భారతీయ భాషా సంస్థ)లో శిక్షణ పొందుతున్న దక్షిణ భారతదేశ తెలుగు అధ్యాపకులు బుధవారం జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలను సందర్శించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కళాశాలలో వివిధ విభాగాలను, గ్రంథాలయాన్ని వారు పరిశీలించారన్నారు. తెలుగు అధ్యాపక శిక్షణలో భాగంగా ఈ కళాశాలను ఎంపిక చేసుకున్నట్లు భారతీయ భాషా సంస్థ తెలుగు అధ్యాపకుడు డాక్టర్ మిరియాల సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులతో ముఖాముఖి చేపట్టారు. శిక్షణలో భాగంగా తెలుగు అధ్యాపకులకు పద్య, పుస్తక పఠనం పోటీలు నిర్వహించి విజేతలకు సిస్టర్ షైజీ బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ హేమ, డాక్టర్ జె.నిర్మల్, డాక్టర్ కిలారి గౌరీనాయుడు, దీప్తి, సిస్టర్ జైన్ పాల్గొన్నారు.